క్లుప్తంగా

విధులు సక్రమంగా నిర్వహించాలి



జగదేవ్‌పూర్‌లో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఐజీ రామేశ్వర్‌సింగ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని మెదక్ లోక్‌సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ డీఐజీ రామేశ్వర్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ చంద్ర మోహన్, సిబ్బంది ఉన్నారు.

5 నుంచి కిక్‌బాక్సింగ్ శిక్షణ



గజ్వేల్‌రూరల్: కరాటే, కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా చీఫ్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి నెల రోజులు పట్టణంలోని మహతి హైస్కూల్, ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఉచిత కరాటే, కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. 16 ఏళ్లలోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98664 02615 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): యాదవ సంఘం జిల్లా యువజన నాయకుడు ఇస్కిల్ల సాగర్ తన అనుచరులతో శుక్రవారం బెజ్జంకిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య పాల్గొన్నారు.

బీజేపీ నేతల ప్రచారం

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి, దండుపల్లి గ్రామాలలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వుకు ఓటేసి రఘునందన్‌రావును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనుల ఓట్లు దండుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కేటాయించకపోవడం దారుణమని బీజేపీ రాష్ట్ర నాయకుడు గుగులోతు తిరుపతినాయక్ అన్నారు. మండలంలోని మైసమ్మవాగు తండాలో శుక్రవారం ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండోసారి బండి సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

రఘునందన్‌కు మద్దతుగా..

గజ్వేల్‌రూరల్: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి కానుకగా ఇద్దామని ఆపార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. రఘునందన్‌రావుకు మద్దతుగా శుక్రవారం గజ్వేల్‌లో మనోహర్‌యాదవ్, మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గజ్వేల్‌రూరల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన కట్ట మహేష్(30) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. మద్యానికి బానిసై ఇంట్లో డబ్బులు అడిగాడు. కుటుంబ సభ్యులు మద్యం తాగొద్దన్నందుకు గురువారం రాత్రి ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మధు గెలుపుకోసం కృషి

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం కృషి చేస్తామని నంగునూరు మండల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో మైనంపల్లి హన్మంతరావు మండల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మధు గెలుపు కోసం దిశా నిర్దేశం చేశాడన్నారు.

నేలకు జీవం.. కూలీకి జీవనం

- చెరువు మట్టితో భూసారం పెంపు
- ఉపాధి పనుల్లో చెరువుల్లో పూడిక తీత
- పొలాల్లో చల్లుకుంటున్న రైతులు
- జిల్లాలో రోజుకు 65 వేల కూలీలకు ఉపాధి



పొలంలో మట్టిని దంప్ చేస్తున్న దృశ్యం

ఒండ్రు మట్టిని సాగు భూములకు తరలిస్తున్నారు. దీంతో భూసారం పెరిగి పంటల సాగుకు జీవం పోస్తుంది. చెరువు మట్టిలో పోషకాలు సమృద్ధిగా ఉండటంతో భూసారం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఈ మట్టిని చెరువుల నుంచి ఉపాధి హామీ కూలీల ద్వారా తవ్వి ట్రాక్టర్లలో పొలాలకు తరలిస్తున్నారు. జిల్లాలో రోజుకు 65 వేల మంది కూలీలకు ఉపాధి దొరుకుతోంది.

– హుస్నాబాద్‌రూరల్

జిల్లాలో ..

యాక్టివ్ జాబ్ కార్డులు	: 1,28,795
కూలీలు	: 2,20,381
రోజు పనుల హాజరు	: 64,332

సిద్దిపేట జిల్లాలో గత ఏడాది 1020 చెరువుల్లో పూడిక తీత పనులు జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరు చేశారు. ఇప్పుడు రైతుల డిమాండ్‌ను బట్టి చెరువు పూడిక తీత పనులను కొనసాగిస్తున్నారు. జిల్లాలో 1,28,795 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా 2,20,381 మంది కూలీలు ఉన్నారు. రోజుకు జిల్లా వ్యాప్తంగా 65 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈనెల 2వ తేదీన 64,332 మంది కూలీలు హాజరయ్యారు. ఉపాధి హామీ పనులు వ్యవసాయానికి చేయూత నివ్వడంతో పాటు వేసవిలో ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. పూడిక తీతతో చెరువుల్లో వర్షపు నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. అంతేకాకుండా కూలీలకు ఉపాధి దొరుకుతుంది. రైతులకు మట్టి తరలింపు ఆర్థిక భారం తగ్గుతుంది.

సేంద్రియ ఎరువుగా..

మొక్కలకు కావల్సిన నత్రజని, పోటాష్, జింక్, మెగ్నీషియం ఒండ్రు మట్టిలో పుష్కలంగా లభించడం వల్ల పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుంది. పొటాష్ తెగుళ్లను తట్టుకొనే శక్తిని ఇస్తుంది. సెలక భూములకు చెరువు మట్టి సేంద్రియ ఎరువులా పనిచేస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కూలీల సంఖ్య పెంచుతున్నాం



వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిత్యం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్నాం. ఆ మేరకు కూలీల సంఖ్యను పెంచుతున్నాం. కూలీ రేటు పెరగడం, వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో చాలా మంది కూలీలు పనులకు వస్తున్నారు. రైతులకు కావల్సిన పనులు ఉపాధి హామీలో మంజూరు చేసి కూలీలతో చేయిస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్

చెరువు మట్టిలో పోషకాలు



ఒండ్రు మట్టిని పొలాల్లో చల్లితే భూసారం పెరుగుతుంది. పంటలకు కావల్సిన పోషకాలు లభిస్తాయి. అందులో ఎక్కువ సూక్ష్మజీవులు ఉండటంతో తెగుళ్ల నివారించే శక్తి ఉంటుంది. నత్రజని, పొటాష్, మెగ్నీషియం చెరువు మట్టిలో లభిస్తాయి. కలియ దున్నడంతో మొక్కల ఎదుగుదలకు పనిచేస్తాయి. రసాయన ఎరువు వినియోగం తగ్గిస్తాయి. చౌడు నేలలో పోయడంవల్ల పంటల దిగుబడులు పెరుగుతాయి.

– పి.మహేశ్, డివిజినల్ వ్యవసాయ అధికారి, హుస్నాబాద్

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



శబాష్‌గూడెంలో మాట్లాడుతున్న పల్లా

చేర్యాల(సిద్దిపేట): గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిన కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేచరేణి, కడవేర్గు, పోతిరెడ్డిపల్లి, నాగపురి, పెద్దరాజుపేట, శబాష్ గూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. క్యామ మల్లేష్‌ని గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు చందు, కనకయ్య, మానస తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో భక్తిభావం

ఎమ్మెల్యే హరీశ్‌రావు



మల్లారంలో హరీశ్‌రావుకు బొట్టు పెడుతున్న మహిళ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెంపొందుతుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లారం గ్రామంలో జరుగుతున్న పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పోచమ్మ, ఎల్లమ్మ దయతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆ పార్టీల మ్యాచ్ ఫిక్సింగ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు మోదీ ఏమిచ్చారు, గాడిద గుడ్డు అని తన స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు. దేశ భవిష్యత్, భద్రతకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. సిద్దిపేట పట్టణం గుండా రెండు నూతన జాతీయ రహదారులను రూ.5 వేల కోట్లకుపైగా నిధులు వెచ్చించి నిర్మించారన్నారు. సిద్దిపేట జిల్లా ప్రజల చిరకాల స్వప్నం రైలును మోదీ తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీజేపీ వల్లనే రాజ్యాంగం పరిరక్షించబడుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అనుచరులు అనేక అక్రమాలు, అవినీతి పాల్పడ్డారని ఆరోపించారు. మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విభీషన్‌రెడ్డి, వెంకటేశం ఉపేందర్‌రావు, మార్కండేయులు, తాటికొండ శ్రీనివాస్, నరేష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దళితుల సంక్షేమం

బెజ్జంకి(సిద్దిపేట): దళితుల సంక్షేమం కోసం కృషి చేసేది కాంగ్రెస్ పార్టీయేనని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకిలో ఆ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకటి రాములు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ నేతలు కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈవీఎం డిస్ట్రిబ్యూటర్ సెంటర్

గజ్వేల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌ను మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ లోక్‌సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈవీఎంల తరలింపు, భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీలో చేరిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల మాజీ ఎంపీటీసీ భాస్కర్, మాజీ సర్పంచ్ రాంరెడ్డితో పాటు మరో 30 మంది కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేశారు. పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతన కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు, బాల్‌రాజు, గణేష్, కుమార్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ వైభవంగా రథోత్సవం

రాయపోలు(దుబ్బాక): మండలంలోని రాంసాగర్‌లో సీతారామచంద్ర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. నాలుగు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. గురువారం స్వామివారి కల్యాణం, శుక్రవారం రథోత్సవం జరిగింది. ఉత్సవ మూర్తులను రథంలో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు.

◆ కాంగ్రెస్ కడవేర్గు అధ్యక్షుడి నియామకం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కడవేర్గు గ్రామ అధ్యక్షుడిగా బాగోతం బాలచంద్రంని నియమిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. గ్రామ కమిటీల నియామకంలో కడవేర్గు గ్రామ అధ్యక్షుడి నియామకం వాయిదాపడినట్లు చెప్పారు. చంద్రం మెడలో పార్టీ కండువా వేసి అభినందించారు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానని నూతన అధ్యక్షుడు చంద్రం తెలిపారు.

◆ ఎంపీడీఓకు ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని 614 సర్వే నంబర్‌లో రోడ్డు నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో చేపట్టిన ఇంటి నిర్మాణం నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎంపీడీఓకు కర్ర రమేష్ రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఏప్రిల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాడు.

రేవంత్‌కు మతిభ్రమించింది

బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ అధ్యక్షుడు వంశీకృష్ణ

దుబ్బాకటౌన్: సిద్దిపేట అభివృద్ధిని చూసి ఓర్వలేక సీఎం రేవంత్ రెడ్డి మతిభ్రమించి ఎమ్మెల్యే హరీశ్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీ కృష్ణ గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం దుబ్బాకలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాను సస్యశ్యామలం చేయడానికి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతుల కళ్లలో ఆనందం నింపిన ఘనత హరీశ్‌రావుకే దక్కుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో కరువు రాలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరువు తాండవిస్తోందని విమర్శించారు. సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన సత్తా చూపడానికి సిద్ధమైందన్నారు.

నంగునూరు(సిద్దిపేట): కేసీఆర్, హరీశ్‌రావు మంచివారు కాకపోతే 40 ఏళ్లుగా సిద్దిపేట ప్రజలు ఎలా ఆదరిస్తారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో సిద్దిపేటకు వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులు చెప్పకుండా కేవలం హరీశ్‌రావును విమర్శించడానికే వచ్చినట్లుందన్నారు. ఇక్కడి ప్రజలను అవమానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే నైతిక హక్కు సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సిద్దిపేట ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా సీఎం మాట్లాడటం సరికాదన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ



యువజన సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ

హుస్నాబాద్: ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ వద్ద శుక్రవారం యువజన సంఘం జెండాను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాగీరు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైందన్నారు. సమగ్ర యువజన విధానం కోసం ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యెడల వనేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు కొమ్ముల భాస్కర్, అయిలేని సంజీవరెడ్డి, గూడ పద్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జెండాను జిల్లా నాయకుడు గూడెపు సుదర్శన్ ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐవైఎఫ్ ఆవిర్భవించిన నాటి నుంచి ఎన్నో పోరాటాలు చేసి యువత హక్కులను సాధించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ నాయకుడు జంగిలి యాదగిరి, నాయకులు మమత, వరలక్ష్మి, భిక్షపతి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): యువజన, విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేసేది ఏఐవైఎఫ్ మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, మండల కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత రాణి రుద్రమపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 1వ తేదీన ఆమె కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రిపై అసత్యపు ఆరోపణలు చేశారన్నారు. ఓ ట్రావెల్ అధినేత నుంచి రూ.1.50 కోట్ల విలువైన కారును తీసుకున్నాడని, ఎన్‌టీపీసీ నుంచి బూడిద తీసుకెళ్లే లారీలను ఆపి కాంట్రాక్టర్లను బెదిరించి రూ.2 కోట్లు వసూలు చేశాడని ఆరోపించారని మండిపడ్డారు. ఫిర్యాదు చేసినవారిలో కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అక్కు శ్రీనివాస్, అయిత శ్రీధర్ ఉన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



పీటీవెంకటాపూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆయన బంధువు అనురాధ నేతృత్వంలో శుక్రవారం మిరుదొడ్డిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, కోఆప్షన్ మెంబర్ ఎండి అహ్మద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ సర్పంచులు రాములు, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరేద్దాం

మర్కూక్(గజ్వేల్): మెదక్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరవేసి కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పాతూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.

బీఆర్ఎస్ పాలనలో పల్లెలు అభివృద్ధి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మెట్‌పల్లి, చౌడారం, ఎల్లమ్మజాలు, మైలారం గ్రామాల్లో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

ఆలోచించి ఓటేయండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): అభివృద్ధి ఎవరు చేశారో, ఆరు గ్యారెంటీలతో ఎవరు మోసం చేశారో గ్రహించి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూర్‌పల్లి మండలంలోని పీటీవెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందన్నారు.

గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ గారడీ

కొండపాక(గజ్వేల్): గ్యారెంటీల పేరిట గారడీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని మాజీ ఎంపీపీలు రాధాకిషన్‌రెడ్డి, బొద్దుల కనకయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ కోరారు. మండలంలోని సిర్సనగండ్ల, గిరాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ఆయన కుమారుడు సుప్రీత్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, రైతు బంధు సమితీ మండల మాజీ కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నమ్మితే గోసపడతామని..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల మాటలు నమ్మితే గోసపడతామని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, కుకునూరుపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన వెంకట్రామిరెడ్డికి ప్రజల బాధలు తెలుసన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయంపై ఆలోచించాలన్నారు. బీజేపీని ఓడించే సమయం వచ్చిందన్నారు. వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆకుల భద్రప్ప, పుల్లోజు కిరణ్ కుమార్‌చారి, కోల శ్రీనివాస్, ఎంపీటీసీ భూములుగౌడ్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఐలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా..

జగదేవ్‌పూర్(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని మునిగడప గ్రామ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి కూలీలతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ అధ్యక్షుడు రంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కవితరెడ్డి మట్టిని తవ్వి తట్టలో ఎత్తి ట్రాక్టర్‌లో పోశారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేసి కారు గుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, ఐలయ్య, రాజేశ్వరి, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.